# కాంగ్రెస్‌ను నమ్మితే కష్టాలే



జగిత్యాలలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

- వారి పాలనలో ఒరిగిందేమీ లేదు
- బీఆర్ఎస్ పాలనలోనే అన్ని వర్గాల అభ్యున్నతి
- జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్
- కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు

రాయికల్/జగిత్యాల, అక్టోబర్ 25: 'సీఎం కేసీఆర్ పాలనలో అన్నిరంగాల్లో దూసుకెళ్తున్న తెలంగాణపై కాంగ్రెస్ కండ్లు మండించుకుంటున్నది. బీఆర్ఎస్‌ను బద్నాం చేయాలని చూస్తున్నది. ఆ పార్టీ మన రాష్ట్రాన్ని దశాబ్దాల పాటు పాలించి చేసిందేమీ లేదు. దళితులను ఏనాడైనా పట్టించుకున్నాదా..? వాళ్లతో అయ్యేది లేదు.. పోయేది లేదు. అధికారంలో ఉన్నప్పుడు పనులు చేయనోళ్లు, ఇప్పుడు చేస్తరా..? మీరే ఆలోచించాలి' అని జగిత్యాల బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డా. ఎం సంజయ్ కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. రాయికల్ మండల అల్లీపూర్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు, అంబేద్కర్ సంఘ రాష్ట్ర సీనియర్ నాయకులు, టీఎమ్ఎమ్ రాష్ట్ర కార్యదర్శి వేల్పుల ప్రవీణ్ కుమార్, 10 మంది యువత కలిసి మండల కోఆప్షన్ సభ్యులు ఎంఏ మోఖీద్ ఆధ్వర్యంలో, అలాగే అర్బన్ మండలం మోతే గ్రామానికి చెందిన 60 మంది యువకులు జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలోనే తెలంగాణలో అన్ని వర్గాలు అభివృద్ధిలోకి వచ్చాయని, మన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. సమైక్య రాష్ట్రంలో వ్యవసాయాన్ని వెనక్కి నెట్టేశారని, స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో పండుగలా మారిందని చెప్పారు. పేదింటి ఆడబిడ్డల పెండ్లి ఆ కుటుంబానికి భారం కావద్దనే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని ప్రవేశపెట్టారని, మొదట దళిత, గిరిజనులకు అమలు చేసి, తర్వాత బీసీలకు వర్తింపచేశారని గుర్తు చేశారు. విద్య, వైద్యం, వ్యవసాయం, విద్యుత్, ఐటీ రంగాల్లో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ స్థానానికి చేరుకుందన్నారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణంలో జగిత్యాల ముందంజలో కొనసాగుతున్నదని, 4520ఇండ్లు నిర్మించి అత్యంత పారదర్శకంగా లబ్ధిదారులకు అందజేశామని చెప్పారు. దళితులను ఆర్థికంగా వృద్ధిలోకి తేవాలనే ఉద్దేశ్యంతో దళిత బంధు పథకాన్ని అమలు చేసి సత్ఫలితాలు సాధించామని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి కట్టుగా పని చేసి జగిత్యాలలో మరోసారి బీఆర్ఎస్ జెండా ఎగరేయాలని పిలుపునిచ్చారు. దళిత వర్గాలు అభ్యున్నతి చెందాలంటే సీఎం కేసీఆర్ బీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుందన్న నమ్మకంతోనే వివిధ పార్టీల నాయకులు పార్టీలో పెద్ద సంఖ్యలో చేరుతున్నారని వేల్పుల ప్రవీణ్ కుమార్ చెప్పారు. ఇక్కడ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు రత్నాకర్ రావు, ఎంపీటీసీ మోర విజయ లక్ష్మి వెంకటేశ్, పాక్స్ చైర్మన్ రాజ లింగం, బసమల్ల సురేష్, పచుడలా శివ, ప్రశాంత్, జగదీష్, పాలకుర్తి సురేష్, దొబ్బల వేణు, నరేష్, కిష్టంపేట సర్పంచ్ జానా గోపి, మండల ఉప అధ్యక్షులు మహేశ్, ఎంబరి వెంకటేశ్, తిరుపతి గౌడ్, వార్డ్ సభ్యులు ముదం శ్రీను, భోగ నర్సయ్యా, పోతు శ్రీను, ఎస్సీ సెల్ అధ్యక్షులు గంగారాం, నాయకులు శ్రీనివాస్, రఘు, జహంగీర్, నరేష్, రాకేశ్ పాల్గొన్నారు.

# ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా

- కోరుట్ల అభ్యర్థి సంజయ్ కల్వకుంట్ల
- బీఆర్ఎస్‌లో 150 మంది యువకుల పార్టీలో చేరిక

కోరుట్ల, అక్టోబర్ 25: 'సీఎం కేసీఆర్ దీవెనలతో మీ ముందుకు వచ్చా. నాకు ఒకసారి అవకాశం ఇవ్వండి.. ఆశీర్వదించండి.. ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తా' అని కోరుట్ల అభ్యర్థి, డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. అనేక పథకాలతో పేదలకు అండగా నిలుస్తూ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలుపుతున్నారని కొనియాడారు. బుధవారం కోరుట్ల పట్టణంలోని 21 వార్డుకు చెందిన 150 మంది యువకులు కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరగా, గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాగా, సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ ప్రజలు సంతోషంగా ఉన్నారని, పార్టీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి పార్టీలో చేరుతున్నట్లు యువకులు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్, వార్డు కౌన్సిలర్‌లు అన్వర్, ఎంబేరి నాగభూషణం పాల్గొన్నారు.



కోరుట్లలో బీఆర్ఎస్‌లో చేరిన యువకులతో డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

# ఆపద మొక్కులోళ్లను నమ్మొద్దు

- మోసపోతం.. గోస పడుతం
- కాంగ్రెస్‌వి అన్నీ పగటి కలలే
- బీఆర్ఎస్‌తోనే తెలంగాణ సమగ్రాభివృద్ధి
- రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్
- వెల్గటూర్‌లో విస్తృత ఇంటింటా ప్రచారం



వెల్గటూర్ మండల కేంద్రంలో ఓటు అభ్యర్థిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్, అక్టోబర్ 25: 'కాంగ్రెస్ పార్టీ గెలిస్తే అది చేస్తాం.. ఇది చేస్తాం అంటున్నది. వాళ్లవన్నీ ఆపద మొక్కులే. గెలిచేదాక ఓ మాట.. గెలిచిన తర్వాత మళ్లీ పాత కథే అవుతుంది. వాళ్ల పాలన మనకు కొత్తనా.. రాష్ట్రాన్ని, దేశాన్ని ఏండ్లకేండ్లు పాలించారు. ఏమైనా చేశారా..? నేనొక్కటే అడుగుతున్నా.. అధికారంలో ఉండి చేయనోళ్లు.. ఇప్పుడు చేస్తరా..? నమ్మితే మోసపోతం. మళ్లీ గోసపడుతం. జాగ్రత్త' అంటూ ధర్మపురి అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రజలకు సూచించారు. 'కొందరు కాంగ్రెస్ నాయకులైతే అప్పుడే గెలిచి అధికారం చేపట్టినట్టు పగటి కలలు కంటున్నరు. 'ఆలూ లేదు.. సూలు లేదు కొడుకు పేరు గోవింద' అన్నట్లు ఉంది వారి పరిస్థితి. నేనొక్కొటే చెబుతున్నా.. వాళ్లు అధికారంలోకి వచ్చేది లేదు.. సచ్చేది లేదని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నరని చెప్పారు. వెల్గటూర్ మండల కేంద్రంలో స్థానిక నాయకులతో కలిసి బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొప్పుల మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందాలంటే ముఖ్యమంత్రి కేసీఆర్ సారే గెలువాలన్నారు. తొమ్మిదిన్నరేండ్లలో రాష్ట్రాన్ని దేశంలో అగ్రస్థానంలో నిలిపిన ఘనత కేసీఆర్‌దేనని పునరుద్ఘాటించారు. రాష్ట్రాన్ని 50 ఏండ్ల పాటు పాలించిన కాంగ్రెసోళ్లకు పేద ప్రజలకు సాయం చేయాలని సోయే లేదని, కేవలం వారిని ఓటు బ్యాంక్‌గా మాత్రమే చూశారని మండిపడ్డారు. ఇక కొందరు నాయకులు పని గట్టుకుని దళితబంధుపై లేనిపోని అసత్య ప్రచారం చేస్తున్నారని, దళితులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ పథకం నిరంతరం కొనసాగుతుందని, వచ్చే 5 ఏండ్లలో రాష్ట్రంలోని దళితులందరికీ రూ.10 లక్షల చొప్పున సాయం అందజేస్తామని తెలిపారు. ఇంకా కేసీఆర్ మూడో సారి ముఖ్యమంత్రి కాగానే 'ఇంటింటికీ కేసీఆర్ బీమా-ప్రజలందరికీ దీమా' కింద ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా, రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి సన్నబియ్యం, ఆసరా పింఛన్ రూ.5 వేలు, రైతుబంధు కింద రూ.16 వేలు, ప్రతి మహిళకు సౌభాగ్య లక్ష్మి కింద రూ.3016, మహిళలకు రూ.400 గ్యాస్ సిలిండర్ అందిస్తామని వివరించారు. కాగా, బీఆర్ఎస్ కార్యకర్త గుండా జగదీశ్వర్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి ఉత్సాహపరిచారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకులు డోలి దేవ్‌రాజ్ సతీమణి అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంటు పోయినట్లే

- కర్ణాటకలో రైతులు విద్యుత్ కోసం కొట్లాడుతున్నరు
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్
- వేములవాడ అభివృద్ధి బాధ్యత నాదే
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు
- వేములవాడ పట్టణంలో ఇంటింటా ప్రచారం



వేములవాడ పట్టణంలో 9వ వార్డులోని పద్మశాలీ కల్యాణ మండపంలో మాట్లాడుతున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్

వేములవాడ, అక్టోబర్ 25: కాంగ్రెస్‌కు ఓటేస్తే ఇక కరెంటు కష్టాలు మళ్లీ మొదలైనట్లేనని, ప్రజలు ఆలోచించి 24 గంటలు కరెంటు ఇచ్చే బీఆర్ఎస్‌కే ఓటు వేసి కేసీఆర్‌ను మూడో సారి ముఖ్యమంత్రి చేద్దామని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ కోరారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రంలో రైతులు కరెంట్ కోసం కొట్లాడుతున్నారని తెలిపారు. వేములవాడ పట్టణంలోని 9వ వార్డులో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుతో కలిసి బుధవారం ఆయన ప్రచారంలో పాల్గొన్నారు. అనంతరం పద్మశాలీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ చివరి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి కూడా తెలంగాణ వస్తే విద్యుత్ కోతలు తప్పవని ఎద్దేవా చేశారని గుర్తు చేశారు. వాటన్నింటిని అధిగమించడమే కాకుండా 24 గంటల కరెంటు, సాగునీరు అందించి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల పక్షాన నిలిచారని గుర్తు చేశారు. ఆనాడు కాంగ్రెస్ తెలంగాణ ఇవ్వలేదని, దేశంలోని అన్ని పార్టీల మద్దతుతో తాము కొట్లాడి తెలంగాణను తెచ్చుకున్నామని ఆనాటి రోజులను గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చేది ఉంటే 2006లోనే ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. 2009లో కూడా ఇచ్చినట్టే ఇచ్చి వెనక్కి తీసుకుందని వాపోయారు. అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడారు. రాజన్న ఆలయంతో పాటు వేములవాడ సర్వతోముఖాభివృద్ధి తాను పూర్తిస్థాయిలో బాధ్యత తీసుకొని అభివృద్ధి చేసి చూపుతానని హామీ ఇచ్చారు. పట్టణం పరిధిలోని పేదలందరికీ ఇప్పటికే 1,200 మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఎమ్మెల్యే రమేశ్ బాబు ప్రతిపాదించారని, వాటిని పూర్తి చేసి అందిస్తానని భరోసా ఇచ్చారు. అర్హులైన వారందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి అందిస్తామని స్పష్టం చేశారు. కోనరావుపేట మండల బిడ్డగా మీ ముందుకు వస్తున్నానని, ఆశీర్వదిస్తే అందుబాటులో ఉండి అభివృద్ధి చేసి చూపిస్తానని చెప్పారు. అంతకుముందు బద్ది పోచమ్మ ఆలయం వద్ద అమ్మవారికి మొక్కారు. అక్కడి నుంచి పద్మశాలీ సంఘం వరకు దుకాణాల్లో తిరుగుతూ ప్రచారం చేశారు. అలాగే విశాల షాపింగ్ యజమాని వేముల శ్రీనివాస్, సుమన్‌కు బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రచారంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు తోట ఆగయ్య, చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుల్కం రాజు, గోస్కుల రవి, కౌన్సిలర్లు మారం కుమార్, నిమ్మశెట్టి విజయ్, నీలం కళ్యాణి, సిరిగి రామ్‌చందర్, యాచమనేని శ్రీనివాస్‌రావు, బింగి మహేశ్, కోఆప్షన్ సభ్యులు బాబున్, నాయకులు రామతీర్థపు రాజు, భాస్కర్ రావు, గూడూరి మధు, ముద్ర కోల వెంకటేశం, నీలం శేఖర్, కోయినేని శ్రీనివాస్, తీగల వెంకటేశ్వర్‌రావు, గజానంద రావు, వెంగల శ్రీకాంత్, గోపు బాలరాజు, జడల శ్రీనివాస్, నరాల దేవేందర్, అక్రమ్ పాషా, చేపూరి రవి తదితరులు పాల్గొన్నారు.